# శ్రీకృష్ణ జన్మస్థానం

కాలిఫోర్నియాలోని లాస్ ఏంజలస్, టెక్సాస్‌లోని మా ఆస్టిన్ కన్నా టైమ్‌లో రెండు గంటలు వెనక వుంటుంది. అందుకే పొద్దున్నే ఏడున్నరకి మా ఫ్లైట్ బయలుదేరి అక్కడికి పదిన్నరకి చేరినా ఆ వూళ్ళో ఇంకా ఎనిమిదిన్నరే అయింది. తొమ్మిదిన్నరకి మీటింగ్. అందుకే ఎయిర్‌పోర్ట్‌లో దిగగానే, రెంటల్ కారు అద్దెకి తీసుకుని, నేనూ కెవిన్ సరాసరి అల్‌హాంబ్రాలో మీటింగ్‌కి వెళ్ళాం. మధ్యాహ్నానికి కానీ మణిని అదే సుబ్రమణ్యన్‌ని పిలవటానికి టైమ్ దొరకలేదు. నన్ను చూసి ఆరేళ్ళపైనే అయిందేమో, ఫోన్‌లోనే చాల సంతోషపడ్డాడు.

"ఇవాళ రాత్రికి మా ఇంటికి రా డిన్నర్‌కి. నళిని ఇంట్లోనే వుందివాళ. అవునూ నువ్వు ఒక్కడివేనా?" అడిగాడు.

"నాతోపాటు ఒక అమెరికన్ మిత్రుడుకూడా వున్నాడు. నేనివాళ ఎక్కడికైనా వెడితే అతను తన స్నేహితుడిదగ్గరకి వెడతానన్నాడు. లేకపోతే ఇద్దరం కలిసి డిన్నర్‌కి వెడదామన్నాడు" అన్నాను

"మరింకేం అతన్నివెళ్ళమను. నువ్వు మా ఇంటికి రా. నీకు కారుందా?"

పెద్దగా నవ్వి "నాకు కారు వుందిలే. కెవిన్‌ని వాళ్ళ ఫ్రెండు పిక్ చేస్తాడు" అని, మణి దగ్గర అపార్ట్‌మెంట్‌కి వెళ్ళటానికి గుర్తులు తీసుకున్నాను.

"సరిగ్గా ఏడున్నరకి వచ్చేయి" అన్నాడు మణి.

వాళ్ళ అపార్ట్‌మెంట్‌కి వెళ్ళేసరికి మణి అక్కడే బయట నుంచుని ఎదురు చూస్తున్నాడు. షేక్‌హాండ్ చేసి, నవ్వుతూ "చాల ఏళ్ళయింది చూసి" అన్నాడు. అతను ఆరేళ్ళ క్రితం మా వూళ్ళోనే వుండేవాడు. నళినికూడా నవ్వుతూ పలకరించింది. నాలుగేళ్ళ కూతురు వేణిని పరిచయం చేసింది. మణి నాన్నగారు ఇంగ్లీష్ బాగా మాట్లాడతారు కానీ, మణి అమ్మగారికి తమిళంతప్ప ఇంకో భాష రాదు. నేనెప్పుడో త్రివేండ్రంలో వున్నప్పుడు గుర్తున్న తమిళ్ మలయాళం రెండూ కలిపి ఆవిడతో మాట్లాడాల్సి వచ్చింది.

మణి నేనూ నళినీ మా పాతరోజుల కబుర్లు చెప్పుకుంటూ భోజనంకూడా పూర్తి చేశాం. నాకు మణి అమ్మగారు, దగ్గరుండి ఆప్యాయంగా అడిగి అన్నీ వడ్డిస్తుంటే, ఇండియాలో మా అమ్మ గుర్తుకొచ్చింది.

"తను వచ్చినప్పటినించీ మా అత్తగారు నన్ను కిచెన్‌లోకి రానీయటం లేదు. అన్నీ ఆవిడే చేస్తారు. నేను ఆఫీస్‌నించీ వచ్చేసరికీ, వంట కూడా పూర్తిచేసి ఎదురు చూస్తుంటారు. వద్దంటే వినరు" అంది నళిని.

అప్పుడే మణి నాన్నగారు, ఆయన పేరు కృష్ణన్ అన్నారు. "మా ఆవిడకి ఇక్కడ బాగానే వుంది కానీ, నాకే అన్ని కష్టాలూ" అన్నారు.

"అదేమిటి. రిటైర్ కూడా అయారు కదా. హాయిగా విశ్రాంతి తీసుకోండి"

"మా నాన్నకి వూరికే కూర్చోవటమనేది అసాధ్యం" అన్నాడు మణి.

కృష్ణన్ అన్నారు "చూశారుగా మావాడి అపార్టుమెంటు. మెయిన్ రోడ్డు మీదకి వుంది. వాకింగ్‌కి వెళ్ళనివ్వడు. ఆ ట్రాఫిక్‌లో పడ్డంటాడు. పొద్దున్న అయిదింటినించీ, రాత్రి పదకొండు దాకా విపరీతమైన ట్రాఫిక్. ఇక వాకింగ్‌కేం వెడతాను"

"అవును. ఈట్రాఫిక్‌లో పడ్డారెండు. ఎక్సిడెంటయితే చాలకష్టం. వచ్చే ఏడు ఇల్లు కొంటానంటున్నాడు కదా. అక్కడయితే క్వయిట్‌గా వుంటుంది వాకింగ్‌కి"

"మా మధురైలో అయితే ఎంతోమంది ఫ్రెండ్స్. ఒయటికి వెళ్ళామంటే చాలు అందరూ పలకరిస్తూనేవుంటారు. ఎన్నో కబుర్లు చెబుతుంటారు. ఇక్కడదేమీ లేదు" అన్నాడాయన. ఒక్క క్షణం ఆగి మళ్ళీ ఆయనే అన్నాడు. "ఇక్కడా ఎదురుపడ్డ అమెరికన్స్ హలో అని పలకరిస్తారు కాని మాట్లాడటానికి ఏమీ వుండదు"

"మీరు పుస్తకాలు చదువుకోవచ్చు కదూ. ఇక్కడ లైబ్రరీలలో చాల మంచి పుస్తకాలు దొరుకుతాయి" అన్నాను.

"నాకు అమెరికన్ బుక్స్ మీద ఇంట్రస్టు లేదు. ఇక్కడేమో తమిళ్ బుక్స్ దొరకవు. మా వాడు ఇండియా ఎబ్రాడో ఏమిటో దానికి సబ్‌స్క్రైబ్ చేశాడు. అది వారానికి ఒక్కసారే వస్తుంది. రెండు గంటల్లో మొదటి పేజీనించీ, చివరి పేజీ దాకా చదివేస్తాను. తర్వాత మళ్ళీ తోచి చావదు"

"ఇప్పుడు ఇంటర్‌నెట్‌లో అన్ని పేపర్లూ వస్తున్నాయి. తమిళ్ పేపర్లూ, పత్రికలు కూడా వుంటాయి. కంప్యూటర్లో ఎన్నో గేమ్స్ కూడా ఆడుకోవచ్చు"

"మా కోడలు చూపించింది కాని, ఆ ఇంటర్నెట్ అంటే నాకు భయం. చకచకా అవన్నీ అలా రంగురంగుల్లో మారిపోతుంటే, కంప్యూటర్ పాడయిపోతుందేమోనని భయం. కంగారు. అందుకే చూడటం మానేశాను."

"మా నాన్న కోసం సాటిలైట్ డిష్ నెట్‌వర్క్ కూడా పెట్టించాను. ఇండియా ప్రోగ్రాములు వస్తాయని" అన్నాడు మణి.

ఆయన నోరు చప్పరించాడు. "ఆఁ వస్తాయి. అన్నీ హిందీ పాటలు. హిందీ సినిమాలు. ఒక పట్టాన నాకు అర్థమయి చావవు. అదీకాక నాకు రెండొందల మంది, డాన్స్ పేరుతో రోడ్ల మీద కవాతులు చేస్తుంటే నచ్చదు"

"అమెరికన్ టీవి ఛానెళ్ళలో, ఇంగ్లీషులో మంచి కామెడీ షోలు, డాక్యుమెంటరీలు, సినిమాలు వస్తాయి. చూస్తుంటారా?" అడిగాను.

"అవి నాకు నచ్చవు" అన్నాడాయన, ఇక ఆ విషయంలో ఏమి మాట్లాడటానికి వీల్లేకుండా

మణి అమ్మగారన్నారు "మావాడు ప్రతి శనివారం మమ్మల్ని ఇండియన్ షాప్‌కి తీసుకెళ్ళి ఆయనకి కావలసిన తమిళ్ సినిమాలు తెస్తాడు కాని ఈయన అవి తెచ్చిన రోజునే అన్నీ చూసేసి మళ్ళీ శనివారం కోసం ఎదురు చూస్తుంటారు"

"తమిళ్ సినిమాలర్థమవుతయి అనేకాని వాటిల్లోనూ హిందీ సినిమాల్లోలాగానే వయొలెన్స్, పగ, సెక్సూ, రోడ్డు మీద గెంతులూ. హిందీ సినిమాలే నయం. కనీసం అర్థం కావు కనుక బ్రతికి బయటపడవచ్చు"

ఆయనన్న మాటలకి నవ్వు వచ్చింది కానీ, సభ్యత కోసం ఆపుకున్నాను.

'డిస్నీల్యాండ్, యూనివర్సల్ స్టూడియోస్‌లాంటివి కూడా చూసేశాం' అన్నారు మళ్ళీ అమ్మగారు.

నవ్వుగా నేను అడిగాను 'ఇంకేం మరి మీకు కాలక్షేపం ఎలా?'

"ఆయనకి కబుర్లు చెప్పేవాళ్ళు కావాలి నాయనా. మనూర్లో అయితే ఇంట్లోనూ రోడ్డు మీదా నడుస్తూనూ ఒక చోటేమిటి ఇక్కడ అక్కడ అని లేదు. ఎవరో కబుర్లు వాళ్ళ మాట్లాడని విషయం అంటూ వుండదు. ఇక్కడేమో మణి నళిని ఇద్దరూ ఉద్యోగాలు పోతారు. పిల్లేమో డే కేర్ సెంటర్‌కి పోతుంది. ఇక ఈయనకి కబుర్లు చెప్పేవాళ్ళు లేక పిచ్చెక్కినట్టు వుంది. సాయంత్రం కొడుకూ కోడలూ ఇంటికి వచ్చినా అలసిపోయి వుంటారు. పది నిమిషాలు ఈయనతో మాట్లాడినా వాళ్ళ పనులు వాళ్ళవి. నాతో మాట్లాడటానికి, పెళ్ళయి నలభై ఏళ్ళయింది, ఇంకా మన మధ్యేం మాటలుంటాయి అంటారు. నవ్వుతూనే అనుకోండి. అయినా కొంతవరకు, మగవాళ్ళ దృష్టిలో అదంతే అని నా అనుమానం" అన్నారావిడ నవ్వుతూ. నేనూ నవ్వాను, మా ఆవిడతో నేనూ సరదాగా అదే అంటుంటాను కనుక

"ఇందాక అడిగారు కదా. నాకు కాలక్షేపం ఎలా అని. నా ఉద్దేశంలో ఆడవాళ్ళకిక్కడ కొంతవరకూ సమయం బాగానే గడచిపోతుంది. కానీ మగవాళ్ళకి అలా కాదు. వయసులో వున్నవాళ్ళ సంగతి కాదు. మాలాగా పిల్లల్ని చూట్టానికి వచ్చిన వాళ్ళ గురించి. అంతకుముందు ఇండియాలో అమెరికన్ సాహిత్యం, సంగీతం సినిమాలు ఆటలు రాజకీయాలు. మొదలైన వాటి మీద పరిచయమున్నవాళ్ళకి ఫరవాలేదు కానీ, అవి లేని నా వయసులో వాళ్ళకి చాల కష్టం. ఈ వయసులో వాటి మీద ఉత్సాహం కలగజేసుకోవటం కూడా అంత సులభం కాదు. మేము అమెరికా వెళ్ళామని అక్కడ చెప్పుకుంటామే కాని, ఎంతవరకూ ఇక్కడ అనుభవించామనేది చెప్పటం కష్టం. నాకు మాత్రం శ్రీ కృష్ణజన్మస్థానంలో వున్నట్టుగా వుంది" అన్నారు కృష్ణంగారు.

"మీ సంగతేమో కానీ, నేను మాత్రం మా అబ్బాయి దగ్గర వుండి వాడితోనూ, కోడలు పిల్లతోనూ, ముఖ్యంగా నా మనవరాలితోనూ గడుపుతున్న రోజుల్ని మరచిపోలేను. నాకు వాళ్ళతో గడుపుతున్నందుకు చాల ఆనందంగా వుంది. ఈ వయసులో ఇంతకన్నా ఏం కావాలి" అన్నారు అమ్మగారు.

అమెరికాలో ఎవరింటికి భోజనానికి వెళ్ళినా, ఎవరి ప్లేట్లల్లో వాళ్ళు తెచ్చుకుని, వాళ్ళే తిని, ఆ ప్లేట్లు వాళ్ళే కడిగేసుకునే మా సంస్కృతిలో, ఈరోజు ఆవిడ నాపక్కనే కూచుని, ప్రేమగా నాకు అన్నంతోపాటు అనురాగాన్ని కూడా వడ్డించి ఒక అనుభూతిని మిగిల్చారు. నేను మాత్రం ఆ రోజుని ఎలా మరచిపోతాను.

* * *